ఇటుకల తయారీతో నిత్యం ఉపాధి

- మన్నికగా ఉంటుండటంతో తగ్గని గిరాకీ
- వ్యాపారాలు లాభసాటిగా ఉన్నాయంటున్న బట్టీల యజమానులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు ప్రాంతంలో గృహ నిర్మాణాలకు మట్టి ఇటుకలను వాడుతుంటారు. దీంతో ఇటుకలకు భలే గిరాకీ ఏర్పడింది. ఎండాకాలంలో రేటు అధికంగా ఉన్నాయి. ప్రస్తుతం ట్రాక్టర్ ఇటుక రూ.9 వేల వరకు పలుకుతోంది. మండలంలోని అనంతరాజుపేట, మైసూరావారిపల్లె, దిమ్మెశెట్టిపల్లె, తురకపల్లె తదితర గ్రామాల్లో ఎక్కువమంది ఇటుక వ్యాపారాన్ని నిర్వహిస్తుంటారు. చుట్టుపక్కల పొలాల్లో మట్టిని సేకరించి ఇటుకలు తయారుచేసే చోటికి తరలిస్తారు.

ఈ మట్టి ఒక ట్రాక్టర్‌కు రూ.900ల నుంచి రూ.1500ల వరకు చెల్లించి కొనుగోలు చేస్తారు. అలాగే వరిపొట్టును సేకరించి మట్టిలో కలిపి ఇటుకలు తయారు చేసి బట్టీలుగా పేర్చి మామిడి, కంప కొయ్యలతో బట్టీలను కాలుస్తారు. కాల్చిన ఇటుక ఎంతో దృఢంగా నిర్మాణానికి అనువుగా ఉంటుంది. ఎక్కువ శాతం ప్రజలు మట్టి ఇటుకలపైనే దృష్టి పెడతారు. ఇటుకలు దొరకని సమయాల్లో ప్రత్యామ్నాయాలపై ఆధారపడతారు. ఈ ఇటుక బట్టీల వల్ల సుమారు బట్టీకి పది మంది వరకు ఉపాధి లభిస్తుంది. ఇటుక బట్టీలను తయారు చేసేవారు అక్కడే


బట్టీలో కాలుతున్న ఇటుకలు


ఇటుకలను తయారు చేస్తున్న కూలీలు

నివాసం ఉంటూ నెల జీతాలు కూడా తీసుకుని ప్రతి నిత్యం మట్టితో అచ్చుల ద్వారా ఇటుకలను తయారుచేసి 40వేల నుంచి లక్ష ఇటుకల వరకు బట్టీలుగా పేర్చి ఇటుకలను కాలుస్తారు. ఎరుపు రంగు వచ్చే వరకు ఇటుకలను కాల్చి బట్టీని తీసేస్తారు. తర్వాత ఇటుకలను అమ్మకానికి పెడతారు. ఎండా కాలం పోయి వర్షా కాలంలో ఇంకా ఇటుకలు ధరలు పెరిగే ఆస్కారముంది. కొందరు ఇటుక బట్టీల యజమానులు ఇటుకలను కాల్చి ఇప్పుడు అమ్మకుండా నిల్వ చేసుకుంటున్నారు. దీంతో అగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలో అధిక ధరలకు ఇటుకలను విక్రయించి లాభాలు గడిస్తున్నారు.

ఇటుకల ధరలు తగ్గితే మాకు ఆదాయం లభిస్తోంది



ఇటుకల ధరలు తగ్గడం వల్ల నిర్మాణాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. దీంతో నిర్మాణ సామగ్రికి గిరాకీ ఉంటుంది. మామూలు కంటే వ్యాపారం మంచిగా జరుగుతోంది. దీంతో మంచి ఆదాయం చూస్తున్నాం. ఇళ్ల నిర్మాణాలు ప్రతినిత్యం చేపట్టడం వల్ల సంవత్సరమంతా ఆదాయం ఉంటుంది.

- కాకర్ల చంద్రశేఖర్ రెడ్డి, వ్యాపారి, కోడూరు

కూలీ గిట్టుతోంది



ఇటుకల బట్టీలో పని చేస్తున్నాను. రోజుకి తక్కువలో తక్కువగా 1000 ఇటుకలు చేస్తున్నాను. దీంతో ఇద్దరికి రోజుకి రూ.1400 అందుతోంది. బయట పనులకు వెళ్లితే పూట గడిచేది కూడా కష్టంగా ఉండేది. ఇక్కడ గిట్టుబాటుతో పాటు ఏడాదంతా పని ఉంటుంది. ఇంటి అవసరాలు తీరుతున్నాయి.

- రమణయ్య, ఇటుక బట్టీల కూలీ, రైల్వేకోడూరు

8న చిట్వేలిలో గంగమ్మ జాతర


చిట్వేలిలో ఊరేగుతున్న దున్నపోతు

చిట్వేలి : మండల కేంద్రమైన చిట్వేలిలో ఈనెల 8వ తేదీ గురువారం వైభవంగా గంగమ్మ జాతరను నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహకులు తెలియజేశారు. అనేక తర్జనభర్జనల తరువాత ఎట్టకేలకు జాతర చేయాలని నిర్ణయించినట్లు వారు తెలిపారు. స్థానిక కుమ్మర వీధిలో తయారైన గంగమ్మ పోతురాజు సమేతంగా గురువారం తెల్లవారుజామున గుడికి బయలు దేరి అక్కడ నుంచి పోలీస్ స్టేషన్ సందు వరకు పాత చిట్వేలి వారు, అక్కడి నుంచి ప్రభుత్వ ఆసుపత్రి సందు వరకు అరవ వీధి వారు, అక్కడ నుంచి గంగమ్మ గుడి వరకు శింగనమల వీధి తదితరులు మొక్కులు తీర్చుకునే విధంగా జాతరను నిర్ణయించారు. సాయంత్రం 4 గంటల నుంచి పందేరపు బండ్లు తిరుగుతాయన్నారు. అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకోవాలని కార్యనిర్వాహకులు కోరుతున్నారు.

జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలి

చిట్వేలిలో ఈనెల 8వ తేదీన జరగనున్న గంగమ్మ జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ రఘురాం ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రశాంతతకు భంగం కల్గిస్తే సహించేది లేదని, అట్టివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

క్లుప్తంగా

నేడు వాసవీ దేవి జయంత్యుత్సవం

రాయచోటి(రామాపురం) : మండల పరిధి నీలకంఠ్రావుపేటలో అమ్మవారిశాలలో బుధవారం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి జయంత్యుత్సవం నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్యం సంఘం అధ్యక్షులు బచ్చు చిన్నరెడ్డెయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవంలో భాగంగా మహాగణపతి పూజ, మూల ఉత్సవ మూర్తులు, శ్రీచక్రము, రుద్ర, పంచామృతాభిషేకాలు, రాత్రికి లలితాసహస్ర నామ కుంకుమార్చన పూజలు, తీర్థప్రసాదాలు, మహామంగళహారతి పలు కార్యక్రమాలు ఏటా వైశాఖ శుద్ధ దశమి రోజున అమ్మవారి జయంత్యుత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు.

భక్తి శ్రద్ధలతో భావనారాయణుడికి పూజలు


పూజలందుకున్న భద్రావతి సమేత భావనారాయణ స్వామి

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ లోని పార్వతీపురంలో వెలసిన శ్రీ భద్రావతి భావనారాయణ స్వామికి మంగళవారం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి అభిషేకం, అలంకరణ, గణపతిపూజ, పుణ్యాహ వాచనం, అమ్మవారికి కుంకుమార్చన, తీర్థ ప్రసాదాల వినియోగం వంటి కార్యక్రమాలను జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. బుధవారం స్వామివారికి ఉత్సవ మూర్తులకు కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. అలానే అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యుల తెలిపారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం


పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

సిద్దవటం : విద్యార్థులు పుస్తకాలను చదవితే పూర్తిగా విజ్ఞానం సొంతమవుతుందని గ్రంథాలయాధికారిణి లక్ష్మీనారాయణమ్మ తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు పుస్తక పఠనం చేయించి నీతి పద్యాలు చెప్పించడం జరిగిందన్నారు. డ్రాయింగ్, ఆటల పోటీలు వంటి కార్యక్రమాలను నిర్వహించామన్నారు. అనంతరం పిల్లలతో ఆటలను ఆడించినట్టు తెలియజేశారు.

ప్రకృతి ఆధారిత వ్యవసాయమే భవిష్యత్


రైతులను సత్కరిస్తున్న మండిపల్లి హరిత

చిన్నమండెం : ప్రకృతి ఆధారిత వ్యవసాయమే భవిష్యత్ అని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సతీమణి మండిపల్లి హరిత పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై సమన్వయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హరిత మాట్లాడుతూ రైతు దేశానికి వెన్నెముక అన్నారు. రసాయనాల వాడకాన్ని తగ్గించి ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఉత్పత్తి చేయాలని రైతులకు సూచించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ రైతులు చంద్ర మోహన్, రమణమ్మలను సన్మానించారు. కార్యక్రమంలో ఏఓ గీత, హెచ్ఓ వనిత, సెర్ప్ ఏపీఎం రెడ్డమ్మ, ఎంఎంటీఎల్ చందు, హెచ్ఎన్ఎఫ్ పావని, మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ పద్మావతి, సెర్ప్, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న మిత్రులు


బాధితునికి నగదు అందజేస్తున్న స్నేహితులు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె పంచాయతీ స్థానిక బస్టాండ్‌లో నాయీబ్రాహ్మణ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వెంకటరమణ అనారోగ్యానికి గురికావడంతో అతని స్నేహితులు రూ.50 వేల ఆర్థికసాయాన్ని మంగళవారం అందజేశారు. వెంకటరమణకు ఇటీవల గుండెపోటుకు రావడంతో గుండెకు స్టంట్స్ వేశారు. విషయం తెలుసుకున్న చిన్ననాటి స్నేహితులు పల్లె మాధవి, అల్లం అశోక్‌కుమార్, బోనాసి నరసింహులు, శ్రీధర్, ఆనాల నరసమ్మ, నాగసుబ్బయ్య, గులాం, కట్టా సుబ్బన్న తదితర స్నేహితులు చందాలు వేసుకుని బాసటగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు.

ప్రజాధనాన్ని కొల్లగొట్టడానికి పథక రచన

- కుట్టుమిషన్ల శిక్షణ పేరుతో బీసీలకు కూటమి కుచ్చుటోపీ
- ప్రభుత్వ దోపిడీపై మండిపడ్డ వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు


మాట్లాడుతున్న బీసీ నాయకులు వడ్డే రమణ

రాజంపేట టౌన్ : బీసీ మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ల పంపిణీ, శిక్షణ పేరుతో కూటమి ప్రభుత్వం రూ.248 కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టడానికి పథక రచన చేసిందని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ విభాగం ప్రతినిధులు వడ్డే రమణ, జెనుగు కృష్ణారావు యాదవ్, చింతల హరీష్‌లు ఆరోపించారు. పట్టణంలోని ఆకేపాటి భవన్‌లో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు తమది బీసీల పార్టీ అని చెప్పుకుంటూ ఉంటారని, అయితే బీసీలకు మేలు చేస్తున్నట్లు ఉచిత కుట్టుమిషన్, శిక్షణ పేరుతో రూ.167 కోట్లు అలాగే కమ్మ, కాపు, ఆర్యవైశ్య, క్షత్రియ కార్పొరేషన్ల పేరుతో మరో రూ.81 కోట్లు ప్రజాసొమ్మును కాజేసేందుకు కుట్రపన్నడం దుర్మార్గమన్నారు. కాగా రాష్ట్రంలో మొత్తం లక్ష మంది బీసీ మహిళలకు ఉచితంగా టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి అనంతరం ఉచితంగా కుట్టుమిషన్‌లు పంపిణీ చేస్తున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అయితే ఇక్కడే కూటమి ప్రభుత్వం భారీ స్కాంకు తెరలేపిందని దుయ్యబట్టారు. ఒక లబ్ధిదారురాలికి టైలరింగ్‌లో ఉచిత శిక్షణ, కుట్టుమిషన్ పంపిణీకి అయ్యే ఖర్చు రూ.7,300 మాత్రమేనన్నారు. ఆ విధంగా లక్ష మంది లబ్ధిదారులకు రూ.73 కోట్లు మాత్రమే ఖర్చవుతుందని తెలిపారు. అయితే ఇందుకోసం టెండర్ కాస్ట్ రూ.230 కోట్లని, ఇందులో లబ్ధిదారులకు కేవలం రూ.73 కోట్లు మాత్రమే ఖర్చు అవుతుందని, మిగతా 167 కోట్ల ప్రజాధనం కూటమి నాయకుల జేబుల్లోకి వెళ్లనుందని ఆరోపించారు. కేవలం 50 రోజుల ఉచిత కుట్టు శిక్షణ, కుట్టుమిషన్ల పంపిణీలో రూ.167 కోట్లను స్వాహా చేయనుందని ఆరోపించారు. త్వరలో ఇదే తరహాలో కమ్మ, కాపు, ఆర్యవైశ్య, క్షత్రియ ఇలా ఐదు కార్పొరేషన్‌లకు మరో యాభైవేల కుట్టుమిషన్లకు ప్రభుత్వం టెండర్లు వేసేందుకు సిద్ధమవుతోందని తెలిపారు. ఒక్కో కార్పొరేషన్‌కు పదివేల కుట్టుమిషన్ల చొప్పున అంటే మరో రూ.115 కోట్ల రూపాయలకు టెండర్లను పిలవనుందని తెలిపారు. ఆ ప్రకారం కూటమి ప్రభుత్వం రూ.81 కోట్లు స్కాం చేయనుందని ఆరోపించారు. మొత్తం కూటమి ప్రభుత్వం రూ.248 కోట్ల ప్రజాధనాన్ని కాజేయనుందని తెలిపారు. కూటమి పార్టీల చేస్తున్న దోపిడీ పాలనను ప్రజలు గమనిస్తున్నారని, కూటమి పాపాలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పే సమయం దగ్గరలోనే ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ నాయకులు మున్నూరు రామ, దేశిబోయిన రవి, బిళ్లా నాగరాజు, పోలి శివయ్య, రామ్‌నగర్ శివ, చికెన్ శ్రీను, రామ్‌నగర్ వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి

సంబేపల్లె : బాలికల పట్ల జాగ్రత్త వహించాలని గున్నికుంట్ల సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆదిలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం అంగన్‌వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమాన్ని దుద్యాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మే 2వ తేదీ నుంచి జూన్ 10 తేదీ వరకు గ్రామాలలో కిశోరి వికాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 11 వయస్సు నుంచి 18 సంవత్సరాలలోపు బాలికలు ఆపద సమయాలల్లో ఎలా స్పందించాలి, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

రాయచోటి(రామాపురం) : కిశోరి బాలికలు, మహిళా హక్కుల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ రామాపురం సెక్టర్ సూపర్‌వైజర్ హుస్సేనమ్మ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని హసనాపురం పంచాయతీ కొండావాండ్లపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి బాలికల వికాసం కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కిషోర్‌బాలికల వికాసం చేపట్టిందని, 12-18 సంవత్సరాలలోపు బాలికలు తమలక్ష్యాలను ఏర్పరచుకొని ముందు సాగాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కిషోర్ బాలికల వికాస కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రహజాన్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నమండెంలో..


చిన్నమండెం: వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారి

చిన్నమండెం : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే పలు రకాల రోగాలకు దూరంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హరిత తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని సి.మాలపల్లి అంగన్వాడీ కేంద్రంలో కిశోర బాలికల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల రుతుక్రమ పరిశుభ్రత నిర్వహణ, లైంగిక విద్య, వ్యక్తిగత పరిశుభ్రత, హెల్ప్‌లైన్ నెంబర్లపై వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సుండుపల్లె : మండల పరిధిలోని అంగన్వాడీ సెక్టార్-2 పరిధిలోని చెన్నంశెట్టిపల్లె అంగన్వాడీ సెంటర్లో సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్త కె.చిట్టెమ్మ ఆధ్వర్యంలో మంగళవారం కిశోరి బాలికల వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల హక్కులు, రక్షణ, పోక్సో చట్టం, సైబర్ నేరాలు, ఆన్‌లైన్‌లో భద్రత, విద్య ప్రాముఖ్యత, బాల్యవివాహాలు, చిన్న వయస్సులో గర్భం దాల్చడం వలన జరిగే నష్టం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన అలాగే మిగతా గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని అంగన్వాడీ సిబ్బందికి ఆమె సూచించారు.


సంబేపల్లె: కిశోరి వికాస్ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది


సుండుపల్లె: కిశోరి బాలికల వికాసంపై వివరిస్తున్న విజయలక్ష్మి

పారిశుద్ధ్య లోపం.. అవస్థలమయం

సిద్దవటం : మండలంలోని వంతాటిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని సంటిగారిపల్లె ఎస్సీ కాలనీలో పారిశుద్ధ్యం లోపించిందని స్థానికులు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ సంటిగారిపల్లె ఎస్సీ కాలనీలో గత కొన్నిరోజులుగా మురుగు నీరు స్తంభించిపోయి దుర్వాసన వెదజల్లుతోందన్నారు. దీంతో తీవ్ర అవస్థలు పడుతున్నట్టు తెలియజేశారు. మురుగునీరు స్తంభించిపోయినా సంబంధిత అధికారు పట్టించుకోలేదని కాలనీ వాసులు వాపోయారు. మురుగు నీరు ఇలానే ఉంటే దోమలు వ్యాప్తి చెంది విషజ్వరాలు సోకుతాయని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులైన చర్యలు తీసుకొని మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


సంటిగారిపల్లె ఎస్సీ కాలనీలో నిల్వ ఉన్న మురుగునీరు

అడంగల్ సమస్య పరిష్కారానికి కృషి

సిద్దవటం : మండలంలోని మందపల్లె రెవెన్యూ గ్రామానికి చెందిన 100 మంది రైతులకు అడంగల్ రావడం లేదన్న ఫిర్యాదుపై ప్రత్యక్షంగా వచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని కడప ఆర్డీ జాన్ ఇర్విన్ తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం ఆయన రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సిబ్బంది తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. మండలంలో భూ సేకరణకు సంబంధించి చాలా మంది రైతులకు ఇంకా పరిహారం అందలేదని వారికి సంబంధించిన డాక్యుమెంట్స్‌ను తీసుకోవాల్సిందిగా సిబ్బందికి ఆదేశించారు. భూసేకరణకు సంబంధించి పరిహారం అందనివారికి త్వరలో పరిష్కరించి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోండి

లక్కిరెడ్డిపల్లి : కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకం, ప్రధాన మంత్రి జీవనజ్యోతి ఇన్సూరెన్స్ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌హెచ్‌జీబీఎంఎస్ఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ కో-ఆర్డినేటర్ ముబారక్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు డిపాజిట్ ఎడ్యుకేషన్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014వ సంవత్సరం నుంచి 2024వ సంవత్సరం మధ్య కాలంలో 10 సంవత్సరాల కాలంలో చనిపోయిన ఖాతాదారులకు నామినీ వివరాలు లేకపోవడం వలన వారి వారసులకు ఖాతా గురించి తెలియకపోవడంతో పాటు సదరు ఖాతాలలో ఎటువంటి లావాదేవీలు నిర్వహించుకోవడం వలన ఖాతాదారులు డబ్బులు కోల్పోతున్నారన్నారు. ఖాతాదారులు కోల్పోయిన నగదు ఆర్‌బీఐకి జమ అవుతుందని, ఖాతాదారుల సొమ్ము ఆర్‌బీఐకు వెళ్లకుండా ప్రతి ఒక్కరూ మీ వ్యక్తిగత ఖాతాకు నామినీ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఆర్థిక పొదుపు పాటించి పెట్టుబడులు పెట్టాలన్నారు. అలానే కేంద్రం అందిస్తున్న బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు సుబ్బరాయుడు, శ్రీనివాసులు, రాచరాయుడు, కళాజాత రాఘవేంద్ర, వెలుగు సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముబారక్

మైనార్టీలకు సబ్సిడీ రుణాలు

చిట్వేలి : 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అన్నమయ్య జిల్లాలోని మైనార్టీ లబ్ధిదారులకు 4 స్లాబ్‌లలో రుణాలు మంజూరు చేయనున్నట్లు కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య తెలియజేశారు. మొదటి స్లాబ్ కింద రూ.లక్ష, రెండవ స్లాబ్ కింద రూ. 3 లక్షలు, మూడో స్లాబ్ కింద రూ.5 లక్షలు, 4వ స్లాబ్ కింద రూ.8 లక్షలు రుణ సదుపాయం కల్పిస్తామన్నారు.

అర్హతలు..

మైనార్టీ వర్గాలు (ముస్లింలు, బౌద్ధులు, సిక్కులు, పార్సికులు) అభ్యర్థి వయస్సు 21 సంవత్సరాల నుంచి 55 సంవత్సరాలు, అభ్యర్థి వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలకు రూ. 1,50,000లు, పట్టణ ప్రాంతాలకు రూ. 2 లక్షల లోపు ఉండాలి. తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు తప్పనిసరి, కుటుంబంలో ఒకరికి మాత్రమే అభ్యర్థి పాస్‌పోర్టు సైజు ఫోటో, రవాణా పథకం కింద దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తమ డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరిగా జతపరచాలన్నారు. దరఖాస్తును ఈనెల 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని సంబంధిత సర్టిఫికెటు జతపరిచి సంబంధిత ఎంపీడీఓ లేదా మున్సిపల్ కమిషనర్‌కు సమర్పించాలని రాష్ట్ర మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య ఒక ప్రకటనలో కోరారు. వివరాలకు కార్యాలయంలో పనివేళల్లో మైనార్టీ కార్పొరేషన్, కడప వారు 92904 48452, 08562 - 241137 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

25లోపు దరఖాస్తులు చేసుకోవాలి

రామాపురం : మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల కోసం మైనార్టీలు ఈనెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ జాషువా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి కడప జిల్లాలోని ముస్లిం మైనార్టీ, క్రిస్టియన్ మైనార్టీ వర్గాలలోని అర్హులైన అభ్యర్థులు సబ్సిడీ రుణాలు పొందవచ్చునన్నారు. ముస్లిం మైనార్టీలకు రూ.లక్ష నుంచి రూ.8లక్షల వరకు, క్రిస్టియన్ మైనార్టీలకు రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు రుణాలను 50శాతం సబ్సిడీతో అందించడం జరుగుతుందన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు


సారా ఊటను ధ్వంసం చేస్తున్న అధికారులు

రైల్వేకోడూరు అర్బన్ : నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి, రైల్వేకోడూరు మండలాలలో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు సిబ్బంది ఆకస్మిక దాడులు నిర్వహించారు. బుడుగుంటపల్లి వై.కోట ప్రాంతాలలో దాడులు నిర్వహించి 1070 లీటర్ల సారా ఊటను, ధ్వంసం చేసి నాగేశ్వర, కోనేటి మని, సుబ్రమణ్యం, ప్రశాంత్, నందయ్య, నాగయ్య, పెంచలమ్మలను అరెస్ట్ చేశారు. అలానే మరో 8 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారి మధుసూదన్, సీఐ తులసి తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో వైభవంగా సీతా జయంతి


వేడుకను నిర్వహిస్తున్న అర్చకులు


సీతా జయంతికి హాజరైన భక్తులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో మంగళవారం శ్రీ సీతా జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి పరివార దేవతలకు తిరుమంజనం నిర్వహించారు. అనంతరం మూలవర్లకు వ్యాసాభిషేకం, ఆరాధన, అర్చన చేశారు. సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు ఆలయంలోని రంగమండపంలో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై శ్రీ సీతారామ లక్ష్మణ ఉత్సవ మూర్తులను ఉంచి వాసంతిక పూజను మల్లెపూలతో సహస్రనామార్చన నిర్వహించారు.


ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓలు నటేష్ బాబు, ప్రశాంతి, సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఒంటిమిట్ట ఇన్‌చార్జ్ ఎంపీపీ నల్లగుండు లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల నిరసన

రాజంపేట : సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కార్మికులు చేస్తున్న నిరసనలు రెండో రోజుకు చేరుకుంది. మంగళవారం స్థానిక మున్సిపల్ క్యాంపస్‌లో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ మాట్లాడుతూ రాజంపేట ప్రాంతంలో కార్మికులను వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. తక్కువ కార్మికులతో పనిచేయించుకోవడం దారుణమన్నారు. జనాభాను దృష్టిలో ఉంచుకొని కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. ఆ దిశగా అధికారులు అడుగులు వేయాలన్నారు. రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులు సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయన్నారు. వాటిని ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ రమణ, రవిశంకర్, పండు తదితరులు పాల్గొన్నారు.


రాజంపేట: మున్సిపల్ క్యాంపస్‌లో నిరసన చేస్తున్న కార్మికులు

రామాలయానికి బీరువా, కుర్చీలు వితరణ



పెనగలూరు : మండలంలోని దిగువ సిద్దవరం గ్రామానికి చెందిన రామాలయానికి కడపలో ఉంటున్న ఓ స్కూల్ యజమాని లక్ష్మయ్య బీరువా, 20 కుర్చీలు వితరణ చేశారు. అలాగే రామాలయంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి నగదు రూపంలో ఇచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రామాలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారంగా గ్రామానికి అందించినట్లు లక్ష్మయ్య తెలిపారు. అలాగే దిగువ సిద్దవరంలో ఉన్న యూత్ సభ్యులు 100 స్టీల్ క్యారీలను ఆలయం తరపున అక్కడికి వచ్చిన భక్తులకు అందజేశారు.

గాలివీటమ్మకు పట్టువస్త్రాలు సమర్పణ


అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న గాలివీటి కుటుంబసభ్యులు

గాలివీడు : మండల కేంద్రంలో పవిత్ర కుషావతి నదీ తీరాన వెలసిన గాలివీటి గంగమ్మకు వీరబల్లి వాస్తవ్యులు మాజీ ఎమ్మెల్యే దివంగత గాలివీటి విశ్వనాథ రెడ్డి కుటుంబ సభ్యులు, కుమార్తెలు, అల్లుళ్లు పట్టువస్త్రాలు సమర్పించారు. మంగళవారం గేటు వద్ద నుంచి మేళతాళాలు, చెక్కభజనలు, డప్పువాయిద్యాల మధ్య ఊరేగింపుగా బస్టాండ్ మీదుగా పట్టువస్త్రాలను తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో పప్పిరెడ్డి భారతి, పప్పిరెడ్డి ఉమామహేశ్వర్ రెడ్డిలు భోజన వసతిని ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా ఈనెల 12, 13 తేదీల్లో గాలివీటమ్మ తిరునాలను అత్యంత వైభవోపేతంగా జరపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.